స్థాపితం : 1930 LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు

జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

జమీన్‌రైతు

సంపుటి : 79 సంచిక 11 14-3-2008 శుక్రవారం 16 పేజీలు విడి ప్రతి : రూ. 5/-







# ఓట్లు చీల్చితే ఓటమి తప్పినట్లే!

భిన్న పార్టీలు, విభిన్న ఉద్యమాల నేపథ్యంలో గందరగోళంగా, చిందరవందరగా తయారౌతున్న రాష్ట్ర రాజకీయాన్ని తనకనుకూలంగా మలచుకోవడానికి బృహత్ ప్రణాళికలు రచిస్తున్నాడు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు రోజుకొక మలుపు తిరుగుతున్నాయి. చిత్ర విచిత్రమైన పరిణామాలు



సంభవిస్తున్నాయి. ఎప్పుడేమి జరుగుతుందో తెలియని అగమ్య గోచరత్వం నెలకొంటున్నది.

టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీల రాజీనామాలు తెలంగాణా ప్రాంతంలో తీవ్రమైన రాజకీయ తుఫాను సృష్టించాయి. ఆ వుధృత రాజకీయ ప్రభంజనంలో అన్ని పార్టీలు తల్లడిల్లి పోతున్నాయి. కాంగ్రెస్‌కు మరీ సంకటం. తెలంగాణా ఇస్తామని తన నోటితో చెప్పడం ముఖ్యమంత్రికి ఎంత మాత్రం ఇష్టం లేదు. అభివృద్ధి నినాదంతో వేర్పాటు ఉద్యమాన్ని నిర్వీర్యం చేయాలన్నది ఆయన అభిలాష. కానీ తెలంగాణా కాంగ్రెస్ వాదులెవరికీ ఆయన వాదన నచ్చడం లేదు. దాని వల్ల తమ ప్రాంతంలో పార్టీ తుడిచి పెట్టుకుని పోతుందని ఆవేదన చెందుతున్నారు. కాని ముఖ్యమంత్రి ఎదిరించే ధైర్యం ఎవరికీ లేదు. జి.వెంకటస్వామి, ఉప్పునూతల, మధుయాష్కీ గౌడ్ వంటి అసమ్మతివాదులు బహిరంగంగానే కాంగ్రెస్ ఓడి పోతున్నదని ప్రచారం మొదలు పెట్టారు. ఈ ఎన్నికలలో ఓటమి అంటే కాంగ్రెస్‌కు మరణ శాసనం క్రిందే లెక్క అక్కడ ఓడితే తతిమా ప్రాంతాలలో కూడా గెలుపు సందేహంలో పడుతుంది. ఈ ఉత్పాతాన్ని తప్పించుకోవాలంటే ఉప ఎన్నికలు జరగకుండా ఏదో ఒక కుంటి సాకుతో వెనక్కు నెట్టడం; లేక ఏకంగా అసెంబ్లీ రద్దు చేసి పారేయడమో చేయాలి. అవి రెండూ జరిగేట్లు కన్పడడం లేదు. ఓడిపోతామని తెలిసి ఎన్నికలలో పోటీ చేయడం కంటే కాంగ్రెస్ వంటి పెద్ద పార్టీలకు వేరే శిక్ష అవసరం లేదు.

మరొక ప్రక్క చిరంజీవి భయపెడుతున్నాడు. ఆయన రాజకీయ పార్టీ ఏర్పాటుకు రంగం సిద్ధమైపోయింది. ఇక వెనకడుగు లేదు. ముహూర్త నిర్ణయమే తరువాయి. ఆయన పార్టీ రంగంలోకి వస్తే ఆంధ్ర ప్రాంతం జిల్లాలలో రాజకీయ గందరగోళం తప్పదు. గత ఎన్నికలలో కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా నిలిచిన కాపు కులస్తులలో అధిక సంఖ్యాకులు అటు దృష్టి మళ్లించే అవకాశాలు ఎక్కువ. అదే జరిగితే పది నుంచి పదిహేను శాతం ఓట్లు గుట్టగా తరలి పోతాయి. ఆ లోటు పూరించుకోవడం అంత చిన్న పని కాదు.

చిరంజీవి పార్టీ వల్ల రాష్ట్రం మొత్తం మీద త్రికోణపు పోటీలు జరుగుతాయి. గత పాతికేళ్లలో మనకు అను

## ఇదే ముఖ్యమంత్రి వ్యూహం

భవం లేని పరిస్థితి అది. ఎన్టీఆర్ వచ్చిన నాటి నుంచి ఏ ఎన్నిక జరిగినా టిడిపి, కాంగ్రెస్‌ల మధ్యనే పోటీ కేంద్రీకృతమౌతూ వస్తున్నది. తతిమా పార్టీలన్నీ ఈ రెండు ప్రధాన పార్టీల కొంగు పట్టుకుని తిరుగుతున్నాయి. చిరంజీవి రాకతో ఆ పరిస్థితి మారుతుంది. ముగ్గురు అభ్యర్థుల మధ్య పోటీ అంటే, ఏ నియోజకవర్గంలో ఎవరిది గెలుపు, ఎవరిది ఓటమి అని అంచనా కట్టే అవకాశమే లేని సంక్లిష్ట స్థితి అన్నమాట. దేముడి మీద భారం వేసి నామినేషన్ వేయాల్సిందే ఏ అభ్యర్థి అయినా.

చిరంజీవితో రగులుకొంటున్న మరొక ముఖ్యమైన రాజకీయ సంక్షోభం – కుల పోరాటం. ఇప్పటికే కాంగ్రెస్ అంటే రెడ్ల పార్టీ, తెలుగుదేశమంటే కమ్మ పార్టీ అని ముద్ర పడి పోయాయి. కాంగ్రెస్ హయాంలో రెడ్లకు జరిగిన మేలు లేదు; చంద్రబాబు ఏనాడూ కమ్మలకు పెద్ద పీట వేయలేదు. కానీ ఇద్దరు నేతల కులం రీత్యా ఆ అభిప్రాయం ప్రజలలో పాతుకొని పోయింది. ఇప్పుడు చిరంజీవిని కాపు కులస్తులు తమ స్వంతం చేసుకొంటారు. ఆయన వద్దు, కాదు అన్నా జరిగేది అదే. జనాభారీత్యా తతిమా అగ్ర కులాల కంటే అధిక సంఖ్యలో వున్న తమకు రాజ్యాధికారం దక్కడం లేదన్న చింత వారిలో చాలా కాలం నుంచి వుంది. రెడ్డినో, కమ్మనో యాచించి పదవులు పొందాల్సిందే తప్ప, తమ చేతితో వారికి పదవులు దానం చేసే అవకాశం కోసం వారు అర్రులు చాస్తున్నారు. చిరంజీవి ద్వారా లభించబోతున్న ఆ అవకాశాన్ని వారు ఎట్టి పరిస్థితులలో వదులుకోరు. మూడు అగ్రకులాలు రాజ్యాధికారం కోసం పోటీ పడితే గ్రామ స్థాయిలో కుల సంఘర్షణ అనివార్యమౌతుంది.

తొరవ 4వ పేజీలో

## లోపలి పేజీల్లో...

- జిల్లాలో జలయజ్ఞం సాగేనా?
- ఇంటర్ విద్యార్థుల పాట్లు.
- అవినీతి అడ్డాగా ఆర్టీఓ ఆఫీసు.
- కేసుకో రేటు - ఖాకీల రూటు.
- వయ్యారిభామతో జాగ్రత్త.
- సాయిదర్బార్ అద్భుతం.
- రైతుల మోముల్లో ఆనందం.
- ఐటమ్ గాళ్‌గా ఉదయభాను.
- నగరం - చండాలం.






## ఉదయగిరిలోనూ క్రికెట్ బెట్టింగ్

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు చాటుమాటుగా తమ కార్యకలాపాలను జిల్లాలో విస్తరిస్తున్నారు. మొన్న నెల్లూరు నగరంలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడే ముఠా ఒకదానిని పోలీసులు పట్టుకొని వారి నుంచి పెద్ద మొత్తంలో నగదు, బెట్టింగ్‌కు వినియోగించే సెల్‌ఫోన్లు, రికార్డర్లను స్వాధీనం చేసుకోవడం తెలిసిందే. దొంగచాటుగా ఇలాంటి బెట్టిం

### దొరికిన ముఠా

గులను నిర్వహించే ముఠా ఉదయగిరి, చుట్టుప్రక్కల ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో బెట్టింగ్‌కు పాల్పడుతూ వుండగా పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకొన్నారు. ఇండియా-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ఆయా జట్ల గెలుపు ఓటములపై పందాలు కాసే వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ ఒక ముఠా ఉదయగిరి, సీతారాంపురం, మర్రిపాడు, దుత్తలూరు,

తొరవ 14వ పేజీలో



నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పని చేస్తూ చిత్తూరుకు బదిలీ అయిన రవిచంద్ర దంపతులకు వెలమ సంఘం నేతృత్వంలో సన్మాన దృశ్యం.

## ఉపాధ్యాయుల బాహాబాహీ

విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పి ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దవలసిన ఉపాధ్యాయులు స్థాయి మరచి వీధి రౌడీల్లాగా ముష్టి యుద్ధానికి దిగిన సంఘటన వెంకటగిరిలో చోటు చేసుకొంది. మార్చి 4వ తేదీ వెంకటగిరిలో ఉపాధ్యాయులను ఇంటర్మీడియట్ పరీక్షలకు డ్యూటీలు వేసేందుకు జాబితా తయారు చేస్తుండగా ఇది జరిగింది. యుటిఎఫ్

### ఇన్విజిలేషన్ డ్యూటీ కోసం

పది మంది టీచర్ల పేర్లు, ఎపిటిఎఫ్ మరో పదిమందిని, ఎస్‌టియు పదకొండు మంది పేర్లతో డ్యూటీలు వేసేందుకు ఇచ్చింది. అదనంగా ఉపాధ్యాయులను జాబితాలో చేర్చే విషయంలో వివాదం చెలరేగింది. దీంతో ఒక్కసారిగా యుటిఎఫ్, ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘాలకు చెందిన టీచర్లు ఉచ్చం, నీచం మరచి బూతులు లంకించుకోవడమే కాక ఒకరిపై ఒకరు కలబడి ముష్టి యుద్ధానికి దిగడంతో గందరగోళం నెలకొనింది.

# ఇంటర్మీడియట్ విద్యార్థుల పాట్లు!

ఇంటర్మీడియట్ పరీక్షలు వస్తున్నాయంటే చాలు విద్యార్థులతోపాటు, వారి తల్లిదండ్రులకూ పరీక్షా సమయమే. తమ పిల్లలపై కోటి ఆశలు పెట్టుకొని పేరొందిన కళాశాలల్లో ఆర్థిక భారాన్ని మోస్తూ చదివిస్తారు. పరీక్షల్లో మంచి మార్కులు సంపాదించి ఉన్నత స్థితికి పిల్లలు చేరుకోవాలని కలలు కనే తల్లిదండ్రులు కళ్లల్లో వత్తులు వేసుకొని మరీ పిల్లలు శ్రద్ధగా చదివేలా చర్యలు తీసుకొంటారు. రేయింబవళ్లు దగ్గరుండి బాగా చదివేలా చూస్తారు. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పరీక్షల్లో మాత్రం విద్యార్థులు అగచాట్లు పడాల్సి వస్తోంది. మార్చి 5 నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం, మార్చి 6

### పరీక్షా కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవు

నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 27,706 మంది, సెకండ్ ఇయర్‌లో 56,367 మంది విదార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. అధిక మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థులు పడ్డ కష్టం అధికారుల తీరుతో బూడిదలో పోసిన పన్నీరు అవుతోంది. జిల్లాలో పలు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు బెంచీలు లేక క్రింద కూర్చునే పరీక్షలు వ్రాస్తున్నారు. నెల్లూరు నగరంతోపాటు కావలి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి తదితర ప్రాంతాలలో ఇదే పరిస్థితి. కొన్ని చోట్ల సామర్థ్యానికి మించి తరగతి గదుల్లో విద్యార్థులను కూర్చో బెట్టడం వల్ల ఉక్కపోత, అసౌకర్యాల నడుమ పరీక్షలు వ్రాసేందుకు విద్యార్థులు

తొరవ 14వ పేజీలో




లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు తల్పగిరి నేతృత్వంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో ఆస్తమ రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ ఎస్.ఎన్.రాజు




నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న క్రైస్తవ మత ప్రచారకుడు కె.ఎ.పాల్.

# మూషికా దహనం

ఇళ్లలో వుండే ఎలుకలు ఇంట్లోని వస్తువులను పాడుచేస్తుంటాయి. అయితే సూళ్లూరుపేటలో ఎలుక కారణంగా ఒక ఇల్లంతా తగుల బడింది. ఇంట్లో ఎలుక దూరిందని ఇళ్లు తగల బెట్టుకుంటామా అనే నానుడిని వింటూ వుంటాం. ఇక్కడ మాత్రం పరిస్థితి మారింది. ఎలుక దూరిందని ఇల్లు తగులబెట్టుకోవడం కాదు, ఎలుకే ఇల్లు కాలిపోవడానికి కారణమైంది. సూళ్లూరుపేటలో కూలీ పనులు చేసుకొనే మల్లి వెంకటసుబ్బయ్య రోజువారీ పనుల్లో భాగంగా మార్చి 5న దైవ ప్రార్థనలో భాగంగా దీపారాధన చేసుకొని బయటకు వెళ్లాడు. ఇంట్లో

### సూళ్లూరుపేటలో ఇల్లు కాల్చేసింది.

వుండిన మూషికరాజా ఇంట్లో యజమాని లేకపోవడంతో చెలరేగి పోయింది. తన ఇష్టానుసారంగా తిరుగుతూ దీపారాధన చేసిన వత్తిని క్రింద పడేయడంతో మంటలు వ్యాపించి ఒక్కసారిగా పూరిల్లు తగులబడింది. చుట్టుప్రక్కల వారు చూసి ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేయడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ఎలుక ఎన్ని ఇబ్బందులు తెచ్చిపెట్టిందో.

# హాస్టళ్లకు ప్రజాప్రతినిధులు

ప్రజా ప్రతినిధులకు ఉన్నట్లుండి వసతి గృహాలపై ప్రేమ పుట్టుక వచ్చింది. స్పీకర్ ఆదేశం మేరకు ఆలస్యంగానైనా హాస్టళ్ల తనిఖీలకు మళ్లుకున్నారు. మొన్నీమధ్య అల్లూరు ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి నియోజకవర్గంలోని సంక్షేమ హాస్టళ్లను తనిఖీ చేశాడు. ఈ సందర్భంగా శ్లాబ్ పెచ్చులు వూడిపోయి వుండటాన్ని గమనించిన ఆయన సాంఘిక సంక్షేమ శాఖ అధికార్లపై మండిపడ్డారు. మీరు హాస్టల్‌పైన నడవండి అప్పుడు తెలుస్తుంది... అంటూ ఆగ్రహించారు. పిల్లలకు పెట్టే ఆహారాన్ని తనిఖీచేసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కోవలోనే శాసనమండలి

### ఎన్నాళ్లో... కెన్నాళ్లకు!

సభ్యుడు బొమ్మిరెడ్డి రాఘవ ఆత్మకూరు పట్టణంలో వసతి గృహాలను మార్చి 2న తనిఖీ చేశాడు. కూలేందుకు సిద్ధంగా వున్న హాస్టళ్లను చూసి నివ్వెరపోయిన ఆయన ప్రభుత్వంపై నిప్పులు చెరిగాడు. సంక్షేమ రంగానికి పెద్ద పీట వేస్తామని చెప్పే ప్రభుత్వం హాస్టల్ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నదని విమర్శించారు. ఆత్మకూరు నియోజక

తొరవ 14వ పేజీలో




నెల్లూరు టౌన్‌హాల్‌లో స్పందన సాహిత్య - సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న ఆడిటర్ ఆర్వీ శేషయ్య నాయుడు. వేదికపై డాక్టర్ వీరమ్మ, శిరోమణిశర్మ, మహిళా శిశు సంక్షేమ అధికారి రాఘవరావు, నగర డిఎస్పీ పద్మనాగేశ్వరరావు.

# చిత్రవిచిత్రంగా నెంబర్ ప్లేట్లు!



బుద్ధిపుట్టినట్లు వాహనాలపై స్టిక్కరింగ్.

రవాణాశాఖ వాహనాల విషయంలో కొన్ని నియమ నిబంధనలను విధించింది. ఆర్టీఏ అధికారులు-బ్రేక్ ఇన్స్‌పెక్టర్లు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటించని వాహనాల యజమానులు, వాహన చోదకులపై అపరాధ రుసుం విధిస్తుంటారు. నెల్లూరులో వాహన చోదకులు ఈ నియమ నిబంధనలను పాటించడం లేదన్నది ఏ వాహనాన్ని పరిశీలించినా తేటతెల్లం అవుతుంది. ముఖ్యంగా నెంబర్ ప్లేట్ల విషయంలో ఎవరికి వారు తమకు తోచినట్లు, తమకు నచ్చిన, మెచ్చిన రంగుల్లో వింత వింత రూపాల్లో నెంబరు ప్లేట్లను వేసుకొని తిరుగుతున్నారు. ప్రైవేట్ వాహనానికి వైట్ బోర్డు మీద బ్లాక్ లెటర్స్‌తో కనబడేలా ఏర్పాటు చేయాలని నిబంధన వున్నా 70 శాతం మంది వాహన వినియోగదారులు వీటిని పాటించడం లేదు. సినీ నటులు, అభిమాన రాజకీయ నాయకులు, లవ్ సింబల్స్, వురైబొమ్మల తోపాటు రకరకాల రంగుల్లో నెంబర్ ప్లేట్లను బిగించుకొంటున్నారు. పోలీస్, ప్రెస్, రెవిన్యూ, కలెక్టరేట్ తదితర పేర్లు

తొరవ 14వ పేజీలో


నిరుపయోగంగా నెల్లూరు పెద్దాస్పత్రిలోని డాక్టర్ల క్వార్టర్లు

# డాక్టర్ల క్వార్టర్లు కట్టిందెందుకు?

నెల్లూరులోని పెద్దాసుపత్రిలో చికిత్స పొందేందుకు చేరిన రోగులకు అత్యవసర సమయాల్లో వైద్యం అందుబాటులో వుంచాలన్న ఆశయంతో డాక్టర్లు, సిబ్బంది కోసం ఆసుపత్రి ఆవరణలో కట్టిన క్వార్టర్లు నిరుపయోగంగా మారాయి. 50లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ క్వార్టర్లు చీకటి కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఈ క్వార్టర్లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ కొన్నాళ్ల కాపురమున్నారు. ఆ తర్వాత ఎవరూ ఉండకపోవడంతో ఇవి శిధిలావస్థకు చేరుకొన్నాయి. అత్యవసర సమయంలో రోగులకు చికిత్స చేయను డాక్టర్లను పిల్చుకరాను అంబులెన్స్ వెళ్లి వచ్చేసరికి ప్రాణాలు కోల్పోయిన అభా

## ఒక్కరూ కాపురం లేరు

గ్యులు వందల సంఖ్యలో వున్నారు. సిబ్బంది సంగతి దేవుడెరుగు ఆసుపత్రి ఆర్ఎంఓ, సూపరింటెండెంట్ తప్పనిసరిగా ఈ క్వార్టర్లలో వుండి నిత్యం పెద్దాసుపత్రి కార్యకలాపాలను పర్యవేక్షించాలి. కానీ ఆ పరిస్థితే పెద్దాసుపత్రిలో లేకపోవడం వల్ల ఆసుపత్రిలో అన్ని పరిస్థితులు క్షీణించాయి. ఆసుపత్రిలో పనిచేసే కొందరు ముఖ్యులైనా ఈ క్వార్టర్లలో నివాసముండను వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ఒప్పించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## ఖైదీల్లో మళ్లీ ఆశలు!

జీవితఖైదు పడిన ఖైదీల విడుదలను సుప్రీంకోర్టు రెండు దఫాలు తిరస్కరించడంతో విముక్తి కలగవచ్చన్న ఖైదీల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలు చోటు చేసుకొని వున్నాయి. ఖైదీల విడుదలకు కోర్టు తాజాగా కొన్ని షరతులు విధించడంతో 42 మంది ఖైదీలు ఉగాది పండుగ రోజు నెల్లూరు సెంట్రల్ జైలు

తొరవ 14వ పేజీలో



నగరంలోని పోలీస్‌స్టేషన్లన్నీ ఇంతే.

దర్శించండి! శ్రీరస్తు!! తరించండి!!

**శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానం**

నెల్లూరు. ఫోన్: 0861 - 2331156

**బ్రహ్మోత్సవ ఆహ్వానం**

తేది 16-03-2008 నుండి 26-03-2008 వరకు



కార్యక్రమ వివరములు

| | | |
|---|---|---|
| తేది 20.3.2008 గురువారం | రా॥ 9.00 గం॥లకు | హనుమంత సేవ |
| తేది 21.3.2008 శుక్రవారం | రా॥ 9.00 గం॥లకు | బంగారు గరుడ సేవ |
| తేది 22.3.2008 శనివారం | సా॥ 7.00 గం॥లకు | కళ్యాణోత్సవం |
| తేది 23.3.2008 ఆదివారం | ఉ॥ 9.00 గం॥లకు | రథోత్సవం |
| తేది 27.3.2008 గురువారం | సా॥ 7.00 గం॥లకు | తెప్పోత్సవం |

ప్రత్తి రవీంద్రబాబు
చైర్మన్

వేగూరు రవీంద్రరెడ్డి
కార్యనిర్వహణాధికారి

ధర్మకర్తల మండలి సభ్యులు:
మాగుంట విజయారెడ్డి, కొల్లిపాకం రవీంద్రనాథరావు, కందల వెంకటేశ్వర్లు, కామిశెట్టి హైమావతమ్మ, కొండ్రెడ్డి రంగారెడ్డి, వూటుకూరు ముద్దుకృష్ణ, దేశిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, సంపతి హనుమంతరావు

# ప్రతి కేసుకో రేటు... నెల్లూరు ఖాకీల రూటు!

నెల్లూరు నగరంలోని పోలీస్ స్టేషన్లకు న్యాయం కోసం వెళ్లిన ప్రజలకు న్యాయం జరగడమేలేదు. దీనికి కారణం ప్రతికేసుకో రేటు నిర్ణయించి, వాటి వసూలే ధ్యేయంగా నగర పోలీసులు పనిచేస్తున్నారు. స్టేషన్‌కు ఫిర్యాదు రాగానే పోలీసుల ముఖాల్లో ఆనందం తాండవిస్తుంది. ఫిర్యాదును ఉపసంహరించుకొంటామన్నా పొరపాటున కూడా స్టేషన్‌లో సిబ్బంది ఒప్పుకోరు. ఫిర్యాదిదారుడు, నిందితుడు ఇద్దరి వద్దా చెవులు మెలితిప్పి మరీ మామూళ్లు వసూలు చేస్తుంటారు. పెద్ద కేసులొస్తే పోలీస్‌స్టేషన్ మధ్య దళారులతో సందడే సందడిగా వుంటుంది. పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుపడితే వ్యక్తి స్థాయిని బట్టి మామూళ్లు వసూలు చేసుకొని వదలి పెట్టేస్తారు. వ్యభిచరిస్తూ పట్టుబడినా అంతే. రాత్రిళ్లు నిందితులు స్టేషన్‌లో వుండాలంటే ఒక రేటు, కేసు తెమిలే వరకు కోరుకున్న భోజనం పెట్టాలంటే ఇంకో రేటు నెల్లూరు పోలీస్‌స్టేషన్లలో మామూలే. ఈ వ్యవహారాలన్నీ ఏఎస్ఐలు, రైటర్లు పర్యవేక్షించి ఎస్ఐలకు వారానికోసారి లెక్క చెప్పి మామూళ్లు ఇస్తారు. కూటికిలేని పేదలను కూడా కనికరించకుండా మామూళ్లు వసూలు చేసే నక్షత్రకులుగా నెల్లూరు పోలీసులు తయారైవున్నారు. వీరిని సంస్కరించను ఎస్పీ మల్లారెడ్డి ఓ కార్యాచరణను సిద్ధం చేస్తేకానీ నెల్లూరు పోలీసుల పరువు పెన్నపాలు కాకుండా నిలబడుతుంది.

## పోలీసుల తీరు మార్చండి ఎస్పీగారు!

## పోలీసుల రివార్డుల్లో వివక్ష!

వింజమూరు మండలం చాకలికొండ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు దోపిడీ దొంగలను పట్టుకొన్న పోలీసులకు ఇచ్చే రివార్డుల విషయంలో పోలీసు అధికారులు పక్షపాతం చూపించారు. కేసు పురోగతి సాధించను కష్టపడిన వారి పేర్లను చివరన వ్రాసి, ముందు వరుసలో ఉన్నతాధికార్ల డ్రైవర్లు, ఇళ్లలో పనిచేసే సిబ్బంది పేర్లు వ్రాసారన్న విషయమై ఆ శాఖలో తీవ్ర చర్చ జరుగుతుంది. ఈ బ్యాంకు దోపిడీ దొంగలను రెండు నెలల్లో పోలీసులు పట్టుకొని కోటి రూపాయల మేర నగలు రికవరీ చేశారు. స్వల్పకాలంలో కేసు దర్యాప్తులో కష్టపడిన పోలీసుల

తొరవ 14వ పేజీలో

# సాహిత్యపురి సింహపురి



నెల్లూరు వేదాయపాలెంలోని లిల్లీ లిటిల్ ఫ్లవర్ స్కూల్ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న సినీ నటుడు తనికెళ్ల భరణి.

నెల్లూరు అంటే మొలగొలుకుల బియ్యం, నెరజాణలు అన్నిటికి మించి శ్రీనాథ కవి సార్వభౌముడు గుర్తుకు వస్తారని ప్రఖ్యాత సినీ రచయిత, నటుడు తనికెళ్ల భరణి వాఖ్యానించారు. మార్చి 9వ తేదీ నెల్లూరు వేదాయపాళెంలోని లిల్లీలిటిల్ ఫ్లవర్ స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొనను వచ్చిన

## గత స్మృతులలో భరణి

ఆయన మాట్లాడుతూ సంగీత, సాహిత్య సిరిగల సింహపురిలోని టౌన్‌హాలులో జరిగిన కార్యక్రమానంతరమే నాకు సినీరంగ ప్రవేశం జరిగింది. సుమన్ హీరోగా నటించిన కంచుకవచం ద్వారానే నేను సినీ రంగంలోకి అడుగిడాను. ఏ వ్యక్తైనా, కళాకారుడైనా నాటక రంగం ద్వారానే తన ప్రతిభను నిరూపించుకోగలుగుతాడు. రచన, నాటకాలు నాకు పేరు ప్రఖ్యాతులను తెచ్చిపెట్టి, నాకు వృత్తి పరమైన తృప్తిని ఇస్తే; జేబులు నింపింది మాత్రం సినీ నటనే. అప్పట్లో నెల్లూరులో జరిగే నెఫ్జా పోటీల్లో నాటకాలను ప్రదర్శించి బహుమతి అందుకోవడం గొప్పగా భావించేవారు. దీనికోసం కష్టపడి ప్రాక్టీస్ చేసి బహుమతిని అందుకొన్న సంఘటనలు మర్చిపోలేను. నెల్లూరులో అటువంటి సంస్థలు మళ్లీ రావాలి. ఇక్కడే పుట్టి సినీరంగంలో నటన, సంగీత విభాగాల్లో పేరొందిన దిగ్గర్శకులు, గాయకులు, నటులు ఎందరో వున్నారు. నెల్లూరుకు, నాకు విడదీయలేని అవినాభావ సంబంధముంది అంటూ గత స్మృతులను నెమరేసుకొన్నారు భరణి.



ఈ చిన్న మొక్కతో ఎన్ని తిప్పలో..

# వయ్యారి భామతో జాగ్రత్త సుమా!

మన ఇళ్ల ముందు, పరిసర ప్రాంతాల్లో ఏపుగా పెరిగే మొక్కల్లో పార్థీనియం మొక్క ఆరోగ్యానికి ఎంతో చేటు తెస్తుంది. 'వయ్యారి భామ'గా పిలిచే ఈ మొక్క వల్ల శ్వాసకోశ సంబంధ వ్యాధులు, చర్మ సంబంధ రోగాలు ప్రబలే అవకాశం వుందని వైద్యులు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వయ్యారి భామకు మరెన్నో పేర్లున్నాయి. కాంగ్రెస్ గ్రాస్, పిచ్చిమాసుపత్రి, క్యారెట్ ప్యాడ్, గాజర్ గ్రాస్, ఫీవర్ వ్యూ, రాంపూల్, ముంచర్ల కుంప, చాటక్ చాందినీ, వైట్ రూప్ అనే పేర్లతోనూ ఈ మొక్కలను పిలుస్తుంటారు. దీనిలోని పరాగ రేణువుల్లో సెలక్టోన్స్ అనే విష పదార్థం వుంటుంది. పుప్పొడిని పీల్చడం వల్ల ఆస్థమా, బ్రాంకైటీస్, సైనసైటిస్, ఎగ్జిమా, పెర్మెటైటిస్ తదితర శ్వాసకోశ, చర్మ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. ఇప్పటికే ఈ మొక్కల కారణంగా పదిశాతానికి పైగా ప్రజలు ఈ వ్యాధులతో బాధపడుతున్నారని సర్వేలలో తేలినట్లు వైద్యులు నిర్ధారించారు. హై ఫీవర్‌ను ఈ మొక్క తెచ్చిపెడుతుంది. మనుషులకే కాక, పశువులూ ఈ మొక్కల మధ్య తిరగడం వల్ల చర్మ రోగాలను తెచ్చుకొంటాయని నిర్ధారణ అయింది. పంటపొలాల్లో ఏపుగా పెరిగే వయ్యారిభామ, పంటపైన తీవ్ర ప్రభా

**నెల్లూరులో ఎక్కడ చూసినా ఈ మొక్కలే...**

తొరవ 14వ పేజీలో



కళ్యాణమస్తులో ఒకటైన జంటలను ఆశీర్వదిస్తున్న కలెక్టర్ రామ్‌గోపాల్.

# కమనీయంగా కళ్యాణమస్తు

ఏడుకొండలవాడి ఆశీస్సులతో తిరుమల తిరుపతి దేవస్థానం జరిపిస్తున్న కళ్యాణమస్తు వివాహ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాలలో 9వ తేదీ జరిగాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 248 మంది

## ఒక్కటైన 240 జంటలు

జంటలు దరఖాస్తు చేసుకోగా 240 జంటలు కళ్యాణమస్తు ద్వారా ఒకటయ్యారు. నెల్లూరులో టిటిడి కళ్యాణ మండపంలో జరిగిన కళ్యాణమహోత్సవానికి రాష్ట్ర సమాచార శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, కలెక్టర్ రాంగోపాల్ విచ్చేశారు. సాక్షాత్తూ ఆ దేవదేవుని కృపాకటాక్షాలతో జరుగుతున్న ఈ కళ్యాణమస్తులో దంపతులైన వారు నిండు నూరేళ్లూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆశీర్వదించారు. ఆడపిల్లలకు వివాహాలు చేసి అప్పులపాలవుతున్న కుటుంబాలను చూసిన ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్రంలో ఎవ్వరూ పెళ్ళిళ్లు చేసి అప్పులపాలవ్వకూడదని తలచి టిటిడి సహకారంతో కళ్యాణమస్తుకు శ్రీకారం చుట్టారు. తాళిబొట్లు, మెట్టెలు, పట్టు పంచ, చీర తదితర వివాహానికి అవసరమైన అన్నింటినీ తిరుమల తిరుపతి దేవస్థానం వారే సమకూర్చారు.

# రైతులందరికీ రుణమాఫీ చేయాలి

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయ రుణాల మాఫీ పథకాన్ని అన్నివర్గాల రైతులకు వర్తింపజేయాలని బిజెపి సీనియర్ నాయకుడు వెంకయ్యనాయుడు డిమాండ్ చేశారు. 6వ తేదీ నెల్లూరులోని ఆయన స్వగృహంలో మాట్లాడుతూ కొన్ని వర్గాలకు చెందిన రైతులకు మాత్రమే వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని కేంద్రం



ప్రకటించడం అభ్యంతరకరం. రైతులందరి రుణాలను సంపూర్ణంగా మాఫీ చేసేందుకు బిజెపి దేశ వ్యాప్తంగా ఆందోళన చేపడుతుందన్నారు. రానున్న మూడేళ్లలో రైతుల రుణాల మాఫీకి కృషి చేయనున్నట్లు ప్రధాని ప్రకటించడంపై ఈ పథకం అమలుపై అనుమానాలు కల్గుతున్నాయి. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకపోయి బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు... గందరగోళానికి లోగిళ్లు



దరఖాస్తులు అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు.

నెల్లూరు నగరంలో మొదటి విడత ఇందిరమ్మ పథకం క్రింద ఇళ్ళ స్థలాలు కేటాయించేందుకు 6,500 మందిని ఎంపిక చేశారు. ఎంపిక చేసిన వీరందరికీ కొత్తూరు సమీపంలో ఇళ్ళ స్థలాలు కేటాయించడం కూడా జరిగింది.

ప్రస్తుతం పక్కాగృహాల నిర్మాణాలకు సంబంధించి తొలి విడత లబ్దిదారులను ఎంపిక చేసిన డివిజన్లలో డాక్యుమెంటేషన్ కార్యక్రమం జరుగుతున్నది. గృహనిర్మాణ సంస్థ అధికారులు చేపట్టాల్సిన డాక్యుమెంటేషన్ కార్యక్రమాన్ని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించారు. డాక్యుమెంటేషన్‌పై ప్రయివేటు వ్యక్తులకు ఎటువంటి అవగాహన లేకపోవడంతో లబ్దిదారులు గందరగోళానికి గురౌతున్నారు. పక్కా గృహ నిర్మాణానికి సంబంధించిన నిధులు మంజూరు కోసం ప్రతి లబ్దిదారుడు దరఖాస్తు సమర్పించాలి. ఈ దరఖాస్తులను గృహనిర్మాణ సంస్థ ఉచితంగా సరఫరా చేస్తుంది. అయినా కూడా డాక్యుమెంటేషన్ కోసం అనుమతి

## దరఖాస్తులమ్మి సొమ్ము చేసుకొంటున్న బర్మా

పొందిన వ్యక్తులు ఒక్కో దరఖాస్తును 10 రూపాయలకు లబ్దిదారులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. లబ్దిదారులు కూడా 10 రూపాయలేకదా అని దరఖాస్తులు కొనుగోలు చేసారు. ఎవరైనా సందేహించి దరఖాస్తు ఉచితంగా ఇస్తారు కదా అని ప్రశ్నిస్తే, తామే

తొరవ 14వ పేజీలో

# నయన నయా ప్రేమ

ప్రేమకోసం హీరోయిన్ నయనతార పరితపిస్తున్నట్లుంది. ప్రస్తుతం తమిళ చిత్రం 'సత్యం'లో హీరో విశాల్ సరసన నటిస్తోన్న నయనతార అతడితో ప్రేమాయణం సాగిస్తోందన్న పుకార్లు షికార్లు చేస్తున్నాయి. సత్యం చిత్రం అవుట్‌డోర్ షూటింగు వీరిద్దరిని దగ్గర చేసిందంటున్నారు. గతంలో శింబుతో ప్రేమాయణం సాగించిన నయనతార అతడితో తెగతెంపులు చేసుకొని తన కెరీర్‌పై దృష్టి సారించింది. అయినా నయనతారను శింబు వేధించేవాడట. ఈ క్రమంలో తన రక్షణ కోసం నయనతార ప్రత్యేక బాడీగార్డులను సైతం ఏర్పాటు చేసుకొంది. ప్రస్తుతం నయనను ప్రేమిస్తున్న విశాల్ గతంలో రీమాసేన్‌తో ప్రేమాయణం సాగించి, ఇప్పుడేమో నయనతార ప్రేమలో మునిగి తేలుతున్నాడు.



# కొత్త ఐటెం గాళ్!

టీవీలో యాంకర్‌గా ప్రేక్షకులకు సుపరిచితమైన ఉదయభానును ఐటెంగర్ల్‌గా నటించమని పలువురు నిర్మాతలు కోరుతున్నారట. ముమైత్‌ఖాన్ తన పారితోషికాన్ని విపరీతంగా పెంచేయడంతో మరో ప్రత్యామ్నాయం లేక ఉదయభాను వైపు అందరూ దృష్టి సారించారు. 'ఆపద మొక్కులవాడు' చిత్రంలో ఐటెంసాంగ్‌తో అందరినీ అలరించిన ఉదయభాను ప్రస్తుతం ఆరు లక్షల రూపాయలు అడుగుతున్నా ఇవ్వను వెనుకాడడం లేదు. దరిదాపులు అన్నీ టివి ఛానళ్లలో వచ్చే ప్రత్యేక కార్యక్రమాలన్నీ తానే సమర్పిస్తూ ఉదయభాను రెండు చేతులా సంపాదిస్తున్నది. ప్రేమించి పెళ్లి చేసుకొంది. చూడగానే ఆకట్టుకొనే రూపం ఆమె స్వంతం. హీరోయిన్ కావాలని ఉదయభాను కలలుగన్నా ఆ కోరిక నెరవేరలేదు. ఐటమ్‌గర్ల్ గానైనా వెండితెరపై వెలుగుతుందో లేదో కొన్ని నాళ్లు వేచిచూసిగాని చెప్పలేం.





# అమ్మో... మహేష్‌బాబు!

సైనికుడు, అతిథి చిత్రాలు ఫ్లాప్ అయినా క్యూట్ హీరో మహేష్‌బాబు డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. సంవత్సరానికి ఒకే ఒక చిత్రంలో నటించాలన్న ఆయన నిర్ణయం వల్ల పలువురు నిర్మాతలు తమ చిత్రంలో నటించమని మహేష్‌బాబును బ్రతిమాలుకుంటున్నారు. నెల్లూరీయుడు ఎస్. గోపాల్‌రెడ్డి మహేష్‌బాబుకు విన్పించిన 'మిర్చి' చిత్ర కథ బాగా నచ్చింది. ఆ చిత్రంలో ఆయన నటిస్తాడని అందరూ అనుకొంటుండగా 8కోట్ల రూపాయల పారితోషికం మహేష్‌బాబు డిమాండ్ చేశాడట. దీంతో గోపాల్‌రెడ్డి వెనకడుగు వేయడంతో మహేష్‌బాబు తదుపరి చిత్రంపై పరిశ్రమలో సర్వత్రా ఉత్కంఠత నెలకొని వుంది. హ్యాపీడేస్ దర్శకుడు శేఖర్ కమ్ముల అవకాశం ఇవ్వవచ్చని ఫిల్మ్ నగర్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. అంతర్జాతీయ సంస్థ వార్నర్ బ్రదర్స్ చిత్రంలో నటించినా ఆశ్చర్యపోనక్కరలేదు.

# నవనీత్‌కౌర్ ముందు జాగ్రత్త

శ్రీను..వాసంతి..లక్ష్మి... చిత్రం ద్వారా తెరంగ్రేటం చేసిన హర్యానా అమ్మాయి నవనీత్‌కౌర్. ఇప్పటివరకు పలు తెలుగు, హిందీ, తమిళ, కన్నడ చిత్రాల్లో నటించినా అగ్రహీరోయిన్ కాలేకపోయింది. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన నవనీత్‌కౌర్ ఆస్తులు కోట్ల రూపాయల్లో వుండడం అందరినీ ఆశ్చర్య పరుస్తుంది. దీనికి గల కారణాలపై దృష్టిసారిస్తే ఆసక్తికర విషయాలు తెలిసాయి. నవనీత్‌కౌర్‌ను నటించమని కోరిన ప్రతి చిత్రంలో నటిస్తుంది. ఐటమ్ సాంగ్‌లకు డిమాండ్‌ను బట్టి బాగానే పుచ్చుకొంటుంది. ఇచ్చిన పారితోషికం అసలు ఖర్చుపెట్టదు. ప్రతి పైసాను జాగ్రత్త చేయబట్టే పంజాబ్‌లో ఒక పెద్ద షాపింగ్‌మాల్‌ను ఆమె కట్టిస్తుంది. ఎకరాలకు ఎకరాలు భూమిని కొని పెట్టింది. ప్రతి రూపాయిని దుర్వినియోగం చేయకుండా దాచి పెట్టడం ఎలా అన్నది నా ఆలోచన. పొదుపులో నాకొక ప్రత్యేకత వుండాలని భావిస్తాను. రూపాయి, కాలం విలువ నాకు బాగా తెలుసంటుంది ఈ హర్యానా సుందరి.





# యోగా టీచర్‌గా నగ్మా

నగుమోము నగ్మాగా తెలుగు ప్రేక్షకులు ముద్దుగా పిలుచుకొనే హీరోయిన్ నగ్మా త్వరలోనే నటనకు స్వస్తి చెప్పి యోగా గురువుగా మారాలని యోచిస్తోందట. ప్రస్తుతం భోజ్‌పురి చిత్రాలతో బిజీగావున్న నగ్మా, యోగా గురువు రవిశంకర్ వద్ద సుదర్శనక్రియ అనే ఒక అరుదైన ప్రక్రియను నేర్చుకొందట. దీనిద్వారా అలసట, మానసిక రుగ్మతల నుంచి ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే నగ్మా ఈ ప్రక్రియను తన కుటుంబ సభ్యులు, సన్నిహితులకు కూడా నేర్పిందట. యోగాను అభ్యసించడంతోపాటు నేర్పించడంలో కూడా ఆనందం వుందంటోంది నగ్మా. తాము పట్టిన కుందేలుకు మూడు కాళ్లంటే ఎవరు కాదంటారు?



# పెళ్లైతే పనికి రామా?

హీరోయిన్ మాళవికను పెళ్లయ్యాక నటన కొనసాగిస్తారా అని అడిగితే చాలు అగ్గి మీద గుగ్గిలం అవుతుంది. పెళ్లయ్యాక హీరోయిన్లు ఎందుకు నటించకూడదు. అలాగేదైనా రూలుందా? నన్నే ఎందుకని ఇలా అడుగుతారు. నేనిప్పుడు మరింత అందంగా తయారయ్యాను. నడుము మడతల చుట్టూ పేరుకుపోయిన కొవ్వును తొలగించుకొన్నాను. నేనెవరిని చూసి ఈర్ష్యపడడం లేదు. ఒక్క శ్రియ నడుమును చూస్తేనే బాధ. నాక్కూడా ఆమె నడుమంటి నడుము కావాలి. అదే నా కోరిక అంది మాళవిక. చూడాలి ఈ ముద్దుగుమ్మ కోరిక తీరుతుందో లేదో?

## హరికృష్ణ ఎంపిక తెలివైన ఎత్తుగడ

హరికృష్ణకు రాజ్యసభ స్థానం కానుకగా ఇచ్చాడు చంద్రబాబు. తెలుగుదేశం పార్టీలో విశేషమైన పరిణామం ఇది. ఎన్టీఆర్‌ను పదవీ భ్రష్టుడ్ని చేసినప్పటి నుంచి ఆయన కుటుంబ సభ్యులను అధికారిక పదవులకు ఆమడ దూరం పెడుతూ వచ్చాడు చంద్రబాబు. అందువల్లనే హరికృష్ణ, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురంధరేశ్వరి వంటి వారంతా ఆయన్ను వదలి వెళ్లి పోయారు. ఒక దశలో బాలకృష్ణ కూడా చంద్రబాబును శత్రువుగా చూశాడు. ఇప్పుడు రోజులు మారిపోయాయి. అవసరాలు మారిపోయాయి. వత్తిడి పెరిగింది. తనొక్కడే ప్రజల ముందుకు వెళ్తే స్పందన వస్తుందన్న నమ్మకం నశించింది. జనంలో తన క్రెడిట్ రేటింగ్ ఆశించిన స్థాయిలో పెరగలేదన్న నిజం ఆయనకు బాగా అర్థమైంది. సర్వేలు కూడా దాన్నే నిరూపిస్తున్నాయి. వైఎస్ ప్రభుత్వం మీద నాలుగేళ్లుగా జరుపుతున్న పోరాటం ఫలించడం లేదు. ఇదే కొనసాగితే రేపటి ఎన్నికలలో కూడా తాను అధికారంలోకి రావడం అనుమానం. మరొక ఐదేళ్ల పాటు ప్రతిపక్షంలో ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేస్తూ కాలక్షేపం చేయడం చంద్రబాబుకు సుతరామూ ఇష్టం లేదు. అందుకు ఎవరో ఒకరి ఆసరా కావాలి. చంకలో మేకపిల్లను పెట్టుకుని వూరంతా వెతకడం ఎందుకని ఎన్టీఆర్ కుటుంబాన్ని శరణు జొచ్చాలన్న నిర్ణయానికి వచ్చాడాయన. దాని పరిణామమే హరికృష్ణకు రాజ్యసభ అభ్యర్థిత్వం.

ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్లు, ఈ ఎంపికతో ఒకేసారి రెండు ప్రయోజనాలు నెరవేరబోతున్నాయి. మొదటిది ఎన్టీఆర్ కుటుంబంలో తన పట్ల వున్న అసంతృప్తిని, అసహనాన్ని తగ్గించుకోవడం. తద్వారా వారి సహకారంతో రేపటి ఎన్నికలలో సమిష్టి పోరాటం చేయడం. హరికృష్ణ కష్టజీవి. ఆయన ఉపన్యాస శైలి ఎన్టీఆర్‌ను తలపింప చేస్తుంది. హావభావాలు జనానికి బాగా నచ్చుతాయి. ఆ నాటకీయత వల్లనే ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో హరికృష్ణ ఎప్పుడు సభలు పెట్టినా జనం విరగబడి వస్తున్నారు. హరికృష్ణను మచ్చిక చేసుకుంటే, జూనియర్ ఎన్టీఆర్‌ను కూడా ముగ్గులోకి దించే అవకాశం వుంటుంది. సినిమా రంగంలో చిరంజీవికి ఎంత జనాకర్షణ వుందో జూనియర్ ఎన్టీఆర్ పట్ల కూడా అంతే మోజు వుంది. చిరంజీవి ప్రాభవాన్ని తగ్గించడానికి ఆ కుర్రవాడు బాగా పనికి వస్తాడు. రెండవ ప్రయోజనం, వున్న ఒక్క రాజ్యసభ స్థానం కోసం పార్టీలో పది మందికి పైగా పోటీ పడే పరిస్థితిని నివారించడం. ఎవరికి ఇచ్చినా తతిమా తొమ్మిది మంది అలుక పాన్పు ఎక్కుతారు. ఎన్నికల సమయంలో అది పార్టీకి మంచిది కాదు. ఎన్టీఆర్ కుటుంబీకుడంటే అందరూ సర్దుక పోతారు. అలుక వున్నా, ఆగ్రహం పెరగదు. ఇవన్నీ ఆలోచన చేసే చంద్రబాబు, హరికృష్ణ వైపు మొగ్గు చూపాడు.

## నిజంకంటే రాజకీయం ముఖ్యం

హైదరాబాద్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంపై బిజెపి కార్యకర్తల దాడి రాష్ట్రంలో పెద్ద వివాదంగా మారింది. దీనిపై అసెంబ్లీలో సిపిఎం సభ్యులు నానా యాగి చేస్తున్నారు. బివి.రాఘవులు వీధి పోరాటం చేసే స్థాయిలో పోలీసు మీద తిరగబడి జనం దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు. శాసనసభలో బిజెపి పక్ష నాయకుడు కిషన్‌రెడ్డి, సిపిఎం సభా నాయకుడు నోముల నర్సింహయ్య దగ్గర ఈ మాటే ప్రస్తావించాడు. అసెంబ్లీ లాబీలలో తనకెదురొచ్చిన నర్సింహయ్యతో మాట కలిపి, ఈ దాడితో మాకు ఎటువంటి సంబంధం లేదు. మా వాళ్లు సభ పెట్టుకోవడానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రాన్ని బాడుగకు తీసుకున్నారు. అందుకోసం అక్కడకు వెళ్లారు. అంతే తప్ప దాడి కోసం వెళ్లలేదు. అసలు దాడే జరగలేదు. జరగని దానిపై మీరు ఇంత రభస చేయడం ఏమి న్యాయం అని అడిగాడు. ఆ మాటకు నర్సింహయ్య ఒక్క క్షణం కూడా తడబాటు లేకుండా, ఔను నిజమే అని ఏకీభవించాడు. దాడి జరగలేదని మాకు తెలుసు; కానీ కొన్ని సందర్భాలలో నిజాలకంటే రాజకీయాలు ముఖ్యం. దీనిపై ఆందోళన చేయమని పార్టీ ఆదేశించింది. అందువల్ల చేయక తప్పడం లేదు అని కిషన్‌రెడ్డిని సముదాయించాడు.

## వారివేలితో వారి కన్నే పొడుస్తారట!

గత ఎన్నికలలో తనతో మిత్రత్వం నెరపి, ఇప్పుడు ఆగర్భ శత్రువులుగా మెలగుతున్న మార్క్సిస్ట్ కమ్యూనిస్టులంటే ముఖ్యమంత్రికి ఒళ్లు మంటగా వుంది. బివి.రాఘవులు పేరు ఎత్తితే ఒళ్లంతా తేళ్లు జెర్రులు పాకినంత కంపరం కల్గుతున్నది ఆయనలో. ఆ పార్టీని ఎట్లయినా నామరూపాలు లేకుండా చేయాలన్నది కోరిక. రేపటి ఎన్నికలలో సిపిఎం, టిడిపిల మధ్య పొత్తు లేకుండా నివారించగలిగితే కమ్యూనిస్టులు శంకరగిరి మాన్యాలు పట్టి పోతారని భావిస్తున్నారు. అందు కోసం ఒక ప్రణాళిక రచించాడు ముఖ్యమంత్రి.

గతంలో చంద్రబాబు పాలన మీద కాంగ్రెస్ కంటే అధికంగా పోరాటం చేసింది మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ. చంద్రబాబును ప్రపంచ బ్యాంకు జీతగాడుగా అభివర్ణించింది. విద్యుత్ ఉద్యమం వంటి సభలలో బివి.రాఘవులు, చంద్రబాబును నానా తిట్లు తిట్టాడు. చాలా పరుషమైన భాష వాడాడు. ఆనాటి ప్రకటనలు, పత్రికా వార్తలు, ఉద్యమ సంఘటనలు వంటి వాటన్నిటినీ సేకరించమని సమాచార శాఖ అధికారులను ఆదేశించాడు ముఖ్యమంత్రి. వారి ప్రజాశక్తి దినపత్రికలో, వారి రాష్ట్ర కార్యవర్గ సమావేశాలలో చంద్రబాబు ప్రభుత్వం మీద వచ్చిన ప్రకటనలు, తీర్మానాలు సేకరించి, చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రించి, ప్రజలకు పంచి పెట్టాలన్నది ప్రణాళిక. అప్పుడు తిట్టిన తిట్లన్నిటినీ ప్రజలకు ఒకసారి జ్ఞాపకం చేస్తే, వాటిపై జనంలో చర్చ లేవనెత్తితే, సిపిఎం పార్టీ తెలుగుదేశం గడప తొక్క డానికి వెనకడుగు వేస్తుందన్నది ఆశ. రేపటి ఎన్నికలలో సిపిఎం, టిడిపిలు కల్సి పోటీ చేస్తే చాలా చోట్ల కాంగ్రెస్‌కు నష్టం తప్పదని అందరికీ తెలుసు. దాన్ని నివారించడానికే ఈ ఎత్తు. ఒకవేళ

**సిపిఎంను గబ్బు పట్టించే ప్రణాళికను సిద్ధం చేస్తున్న సిఎం**

కమ్యూనిస్టులు సిగ్గు విడిచి టిడిపి కొంగు పట్టుకున్నా, జనంలో వారి విలువ పలచన చేసి, వారి ప్రభావాన్ని సాధ్యమైనంత తగ్గించవచ్చునని ఆశ పడుతున్నారు. రేపటి ఎన్నికల కోసం ముఖ్య మంత్రి ఎంత పకడ్బందీ ప్రణాళికలు రచిస్తున్నాడో, ఎంత తీవ్రస్థాయి రాజకీయ కసరత్తు చేస్తున్నాడో దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు.

సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్
6455555, 9949555444

# ఉత్తరక్రియలు



జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ
తస్మా దపరిహార్యే 2ర్థే న త్వం శోచితం మర్హసి॥

అనురాగానికి ప్రతిరూపంగా, ఆత్మీయతకు ఉపమానంగా
తన మనసులోని తియ్యదనాన్ని మా అందరికి పంచిన అమృతమూర్తి

## చెర్లొ శ్యామలమ్మ గారు

తేది 07-03-2008 శుక్రవారం నాడు
స్వర్గస్తులైనారు.

**పెద్దకర్మ**

తేది 18-03-2008 మంగళవారం రాత్రి "నిలుపు"
తేది 19-03-2008 బుధవారం " ఎత్తురేవు"
16/1867, శ్రీనివాస అగ్రహారం, విజయమహాల్ ప్రక్కన,
నెల్లూరులోని మా స్వగృహము నందు జరుగును.

కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

| కుమారులు - కోడళ్ళు | కుమార్తెలు - అల్లుళ్ళు |
|---|---|
| చెర్లొ సుబ్బారెడ్డి - మంజుల | నెల్లూరు ఇందిర - రాధాకృష్ణారెడ్డి |
| చెర్లొ శేషారెడ్డి - సీత | ఇసనాక దేవసేన - స్వర్గీయ దయాకర్‌రెడ్డి |
| | బత్తిన చంద్రసేన - రాధాకృష్ణారెడ్డి |

మనుమలు - మనుమరాండ్రు
మునిమనుమలు - ముని మనుమరాండ్రు

**చెర్లొ శ్యామలమ్మ**
(స్వర్గీయ చెర్లొ దశరథరామిరెడ్డి గారి ధర్మపత్ని)

Edited, Printed and Published by N. Dolendra Prasad, Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.